సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 6 । ఆగస్టు । 2025



మన చేనేత.. ఘనత
కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు చేనేత కళాకారులు ఎంపికయ్యారు. - 10లో



నకిరేకల్‌లో కార్డెన్ సెర్చ్
నకిరేకల్ పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. - 10లో



వరండాలోనే భోజనాలు
చాలా ప్రభుత్వ పాఠశాలల్లో నేటికి విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి డైనింగ్ హాళ్లు లేవు. - 11లో

న్యూస్‌రీల్

నేడు జయశంకర్ జయంతి

భువనగిరి టౌన్: కొత్తపల్లి జయశంకర్ జయంతిని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జ్ అధికారి సాహితీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు నిర్వహించనున్నామని అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు దూదివెంకటాపురంలో కలెక్టర్ పల్లె నిద్ర

రాజాపేట : గ్రామాల్లోని సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు పల్లెల్లో రాత్రి బస చేయడం జరుగుతుందని కలెక్టర్ హనుమంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం రాజాపేట మండలంలోని దూది వెంకటాపురం గ్రామం నుంచి ఈ కార్యక్రమం మొదలుపెట్టనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం గ్రామానికి చేరుకుని గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును స్వయంగా పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం అధికారులతో కలిసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటామని తెలిపారు.

ఒకేరోజు 2.50 లక్షల మొక్కలు నాటుదాం

భువనగిరి టౌన్ : వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం ఒకే రోజు జిల్లాలో 2.50 లక్షల మొక్కలు నాటాలని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలో మొత్తం 20 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్ణయించగా.. ఇప్పటివరకు 14 లక్షల మొక్కలు నాటడం పూర్తయ్యిందని పేర్కొన్నారు. గురువారం ప్రతి గ్రామంలో 500 మొక్కలు, మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో 300 మొక్కల చొప్పున మొత్తంగా 2.50 లక్షల మొక్కలు నాటడం పూర్తి చేయాలని తెలిపారు. ఈమేరకు అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు.

దివ్యాంగుల పూరిగుడిసె పరిశీలన



మాసాన్‌పల్లిలో పూరి గుడిసెను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవేందర్‌రావు

సాక్షి ఎఫెక్ట్..

గుండాల : మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలో దివ్యాంగులైన బొంత ఎల్లయ్య, లక్ష్మి దంపతులు పూరి గుడిసెలో నివాసం ఉంటుండగా. వారి దీనస్థితిపై సాక్షి దినపత్రికలో మంగళవారం 'నీడ లేదు...గూడు ఇప్పించరూ' అనే శీర్షికన కథనం ప్రచురించింది. స్పందించిన ఎంపీడీఓ దేవేందర్‌రావు బుధవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరిశీలించారు. నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని తెలిపారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి మంద బాలలక్ష్మి ఉన్నారు.

ప్రజా కళలు పోరాట ఆయుధాలు



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

రామన్నపేట: ప్రజా కళలు పోరాట ఆయుధాలు అని, అనేక ఉద్యమాలను కళాకారులే ముందుండి నడిపారని సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు, జానపద వీధి నాటకోత్సవాల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. ఈనెల 20, 21 తేదీల్లో రామన్నపేటలో జరగనున్న జానపద వీధి నాటకోత్సవాల సన్నాహక సమావేశంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. జానపద కళలను పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జానపద వృత్తికళాకారులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. సమావేశంలో ఆహ్వాన సంఘం అధ్యక్షుడు కూరెళ్ల నర్సింహాచారి, గంటెపాక శివకుమార్, ఈర్లపల్లి ముత్యాలు, కందుల హన్మంతు, జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, కల్లూరి అంజయ్య, వనం ఉపేందర్, బోయిని ఆనంద్, కల్లూరి నగేష్, మేడి పృథ్వీ, గంటెపాక శ్రీకృష్ణ, నాగటి లక్ష్మణ్, మేడి ముకుందం తదితరులు పాల్గొన్నారు.



నిత్య పూర్ణాహుతి నిర్వహిస్తున్న యాజ్ఞికులు, అర్చకులు



శ్రీసుదర్శన చక్రానికి పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీసుదర్శన చక్రానికి పవిత్రమాల ధారణ

- వైభవంగా కొనసాగుతున్న పవిత్రోత్సవాలు
- నేటితో ముగియనున్న ఉత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంతో పాటు అనుబంధ పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండవ రోజైన మంగళవారం ఉదయం శ్రీస్వామి వారి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం విశేషంగా జరిపించారు. అనంతరం ద్వార తోరణ ధ్వజ కుంభారాధన, మూర్తి, కుంభ ఆరాధన, అగ్ని ప్రతిష్ఠ, మూలమంత్ర హోమం, పవిత్ర తోరణం జరిపించి, నిత్య పూర్ణాహుతి వేడుక చేపట్టారు. అనంతరం 108 నూలు, పట్టు దారాలతో తయారు చేసిన పవిత్ర మాలలను పుణ్యజలంలో సంప్రోక్షించి, ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తుల వద్ద పూజలు చేశారు. ద్వార పూజ, చతుః స్థానార్చన, మూర్తి మంత్ర విశేష హోమం నిర్వహించారు. అనంతరం విమాన స్వర్ణ గోపురంపై గల శ్రీసుదర్శన చక్రానికి పవిత్ర మాల ధరింపజేసి, నిత్య పూర్ణాహుతి జరిపించారు. ఆయా వేడుకల్లో ఆలయ ఈఓ వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, ఉప ప్రధానార్చకులు పాల్గొన్నారు. పాతగుట్ట ఆలయంలో సైతం వైభవంగా పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి.

నేటితో ముగింపు

యాదగిరీశుడి ఆలయంలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు బుధవారం ముగియనున్నాయి. ఆలయ ప్రథమ ప్రాకార మండపంలోని యాగశాలలో ఉదయం మహా పూర్ణాహుతి జరిపిస్తారు. అనంతరం శ్రీస్వామి వారికి పవిత్ర మాలలను సమర్పించి, ఉత్సవాలకు పరిసమాప్తం పలుకుతారు.

ధాన్యం దిగమింగారు!

- సీఎంఆర్ ఇవ్వడంలో చేతులెత్తేసిన పలువురు మిల్లర్లు
- ధాన్యం కేంద్రాల్లో చేపట్టిన కొనుగోళ్లలో వెలుగుచూసిన అక్రమాలు
- విచారణ చేస్తున్న సివిల్ సప్లయ్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- వలిగొండ పీఏసీఎస్ కేంద్రంలో ట్యాబ్ ఆపరేటర్‌తోపాటు, ఆయన అసిస్టెంట్ అరెస్ట్

సాక్షి, యాదాద్రి : ధాన్యం కొనుగోళ్లలో జరిగిన అక్రమాలపై సివిల్ సప్లయ్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టి సారించారు. సీఎంఆర్ ఇవ్వాల్సిన పలువురు మిల్లర్లు చేతులెత్తేయడం, ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో చేపట్టిన ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు చోటుచేసుకోవడంతో ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది. ఈనేపథ్యంలో సివిల్ సప్లై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్

వలిగొండ మండలం సంగెం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో బోగస్ రైతుల పేరుతో ట్రక్ షీట్‌తో ధాన్యం తూకం వేయకుండానే మిల్లుకు ఎగుమతి చేసినట్లు రికార్డు చూపించారు. అధికారుల విచారణలో రూ. 4.64 లక్షల దుర్వినియోగం బయటపడింది. ఇందులో 4.11 లక్షలు రికవరీ చేశారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. మరికొన్ని కొనుగోలు కేంద్రాలు రైతుల వద్ద రూ.1800 నుంచి రూ.2 వేల వరకు కొనుగోలు చేసి ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. ఇందులో మిలర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల పాత్ర ఉందన్నది బహిరంగ రహస్యం. అదేవిధంగా జిల్లాలోని పీఏసీఎస్ రుద్రవెల్లి, చిన్నరావులపల్లి, ఆలేరు, గుండాల, మోటకొండూరు మండలాల్లో ప్రతియేటా ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు.



భువనగిరిలో రైస్ మిల్లును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సీఎంఆర్ టెండర్ ధాన్యం ఎగవేత

2022–23 యాసంగికి సంబంధించి 4,10,911 మెట్రిక్ టన్నులు ధాన్యం మిల్లులకు ఇచ్చారు. గత ప్రభుత్వంలో 1,86,180 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వేలం వేసి మిల్లులకు అప్పగించింది. అయితే ఇందులో మిల్లులు ఆ ధాన్యాన్ని బహిరంగంగానే విక్రయించారు. దీంతో రెండేళ్లుగా రికవరీ చేయడానికి నానా తంటాలు పడుతోంది. ఆయా మిల్లులకు సీఎంఆర్ ఇవ్వమని ముందుగా ప్రకటించి ఆ తర్వాత యథావిధిగా ధాన్యం కేటాయించారు. టెండర్ ధాన్యం ఇంకా ప్రభుత్వానికి 32,314 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎగుమతి చేయాల్సి ఉంది. కానీ మిల్లుల వద్ద ఇందుకు సంబంధించిన ధాన్యం లేదు. 2024–25 వానాకాలం సీజన్‌లో 2,22,444 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు పంపిస్తే ఇందులో మిల్లర్ల నుంచి ఇప్పటివరకు 48.135 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ మాత్రమే వచ్చింది. ఇంకా 1.02, 458 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ రావాల్సి ఉంది. 2024– 25 యాసంగి సీజన్‌లో 3,76,363 మెట్రిక్ టన్నుల ధాన్నాన్ని మిల్లులకు ఇచ్చారు. ఇందులోంచి 1.92, 611 మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్ రావాల్సి ఉంది. ధాన్యం దిగుమతి చేసుకున్న 25 మిల్లులు కిలో సీఎంఆర్ కూడా ఇవ్వని జాబితాలో ఉన్నాయి.

కొనుగోలు కేంద్రంలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

వలిగొండ : వలిగొండ మండలం సంగెంలోని వలిగొండ పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యుగంధర్ మంగళవారం తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి కొనుగోలు కేంద్రంలో ట్యాబ్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పబ్బతి శేఖర్, ట్యాబ్ ఆపరేటర్ అసిస్టెంట్ కాసుల బాలకిషన్‌ను అరెస్ట్ చేసి రామన్నపేట న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

రెవెన్యూ రికవరీ యాక్టు నమోదు చేసినా..

2022–23వానాకాలంలో గుండాల మండలం అనంతారంలోని ఎల్‌ఎన్ రెడ్డి బిన్ని రైస్ మిల్లుకు కొనుగోలు కేంద్రాల నుంచి 1975 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎగుమతి చేశారు. సీఎంఆర్ ఇవ్వకుండానే 1715 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మర ఆడించకుండానే మాయం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దాని విలువ రూ.4.18 కోట్లు. అధికారులు మిల్లు యజమానిపై రెవెన్యూ రికవరీ యాక్టు నమోదు చేశారే కాని ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదు. పోచంపల్లి మండలంలోని ముక్తాపూర్‌లో ఎల్‌ఎన్ ఆగ్రో రైస్ మిల్లులో సుమారు రూ.10 కోట్లు విలువ చేసే వరి ధాన్యం మాయమైంది.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

- కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం చేయొద్దని, ఎప్పటికప్పుడు అధికారులు ఇళ్ల నిర్మాణ పనులు పర్యవేక్షించాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని యాదగిరిపల్లిలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన తనిఖీ చేశారు. మున్సిపాలిటీలో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇళ్ల వచ్చాయని మున్సిపల్ కమిషనర్ లింగస్వామిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎన్ని ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి.. ఇంకా ప్రారంభించనివి ఎన్ని, ప్రారంభించకపోవడానికి కారణాలు ఏమిటని అడిగారు. యాదగిరిపల్లిలో స్లాబ్ దశలో పనులు జరుగుతున్న గుంటిపల్లి రేణుక ఇంటిని పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు మేస్త్రీలకు స్క్వేర్ ఫీట్‌కు రూ.300 కంటే ఎక్కువ ఇవ్వొద్దన్నారు. ఇటుక, సిమెంట్, స్టీల్ ఎక్కడ నుంచి ఎంత ధరకు తెచ్చుకుంటున్నారని ఆరా తీశారు. ప్రభుత్వమే ఇసుక ఉచితంగా ఇస్తుందని కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ లింగస్వామి, మున్సిపల్ అధికారులున్నారు.

మహిళా సమాఖ్య భవనం పరిశీలన

భువనగిరి టౌన్: కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్మాణ దశలో ఉన్న జిల్లా మహిళా సమాఖ్య భవనం పనులను కలెక్టర్ హనుమంతురావు మంగళవారం పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అక్టోబర్ వరకు పనులు పూర్తి చేయాలని, నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు.



యాదగిరిపల్లిలో లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాజాపేట : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం రాజాపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఓపీ, సాధారణ డెలివరీల వివరాలు, రోగులకు అవసమైయ్యే మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించే విధంగా చూడాలని ఎంపీడీఓ నాగవేణికి సూచించారు. కలెక్టర్ వెంట డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆయూష్ డిస్పెన్సరీ డాక్టర్ చందన, సిబ్బంది తదితరులున్నారు.

కొనసాగుతున్న ఆలయ భూముల సర్వే

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ భూములు, ఆస్తుల వివరాలను పటిష్ఠంగా ఉంచేందుకు చేపట్టిన డీజీపీఎస్ సర్వే కొనసాగుతోంది. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని యోగానంద నిలయం, బస్టాండ్ ముందు గల దేవస్థానం స్థలంతో పాటు ఇతర భవనాలకు సంబంధించిన కొలతలు తీసుకుని సర్వే చేపట్టారు. ఈ సర్వేలో యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ, దేవస్థానం భూముల పట్ల అవగాహన ఉండేందుకు ప్రస్తుతం జూనియర్ సిబ్బందితో ప్రత్యేక కమిటీ వేసి శిక్షణ ఇస్తున్నామని ఈఓ వెంకట్రావ్ వెల్లడించారు. సుమారు 15మంది దేవస్థానం క్లరికల్ సిబ్బంది ఈ సర్వేలో పాల్గొన్నారని తెలిపారు.



సర్వే చేస్తున్న అధికారులు

మునుగోడు అభివృద్ధి నా బాధ్యత



చౌటుప్పల్ మండలంలోని ఎనగంటితండాలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం: మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత తనదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని లచ్చమ్మగూడెం, చిమిర్యాల గ్రామాల్లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి మంగళవారం 33/11 విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గ వ్యాప్తంగా ఐదు సబ్‌స్టేషన్లు ప్రారంభించుకోవడం చాలా సంతోషకరమన్నారు. లోటట్టేజీ సమస్య లేకుండా నియోజకవర్గవ్యాప్తంగా మరో 10 సబ్‌స్టేషన్లు తీసుకురావడానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, ఏడీ పద్మ, ఏఈ దివ్య, కరంటోత్ శ్రీనివాస్, గుత్త ఉమాదేవి, దోనూరి జైపాల్‌రెడ్డి, గుత్త ప్రేమ్‌చందర్‌రెడ్డి, జక్కలి ఐలయ్య, భిక్షపతి, భానుమతి, బుజ్జి, ఉప్పల లింగస్వామి పాల్గొన్నారు.

గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య లేకుండా చేస్తా

చౌటుప్పల్ రూరల్: గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య లేకుండా చేస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలంలోని ఎనగంటితండాలో నూతనంగా నిర్మించనున్న 11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ నెలికంటి సత్యంతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో కరెంట్ సమస్యలు లేకుండా ఉండేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నర్సింహ, నాయకులు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



సంస్థాన్ నారాయణపురం: లచ్చమ్మగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మూసీ రెండు గేట్లు ఎత్తివేత

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరగడంతో మంగళవారం రెండు క్రస్ట్ గేట్లను పైకెత్తి వరదనీటిని దిగువకు వదిలారు. హైదరాబాద్ నగరంతో పాటు మూసీ ఎగువ ప్రాంతాల్లో సోమవారం భారీ వర్షం కురవడంతో మంగళవారం ఉదయం 415 క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో సాయంత్రానికి ఒక్కసారిగా 3,900 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో రెండు క్రస్ట్‌గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 2500 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టుకు 356 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 645 అడుగులు కాగా.. ప్రస్తుతం 642.90 అడుగులు ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

కొండా లక్ష్మణ్‌బాపూజీ అవార్డుకు పలువురి ఎంపిక

భూదాన్‌పోచంపల్లి: చేనేత రంగంలో విశేష కృషి చేసిన ఐదుగురు చేనేత కళాకారులు కొండా లక్ష్మణ్‌బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యారని చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోచంపల్లికి చెందిన చేనేత కళాకారుడు మంగళపల్లి శ్రీహరి (వీవింగ్), వలిగొండ మండలం గొల్నెపల్లికి చెందిన చల్లమల్ల కృష్ణ(వీవింగ్), సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన గూడ పవన్(డిజైనింగ్), కొలను శంకర్(వీవింగ్), సామల భాస్కర్ (వీవింగ్) ఎంపికయ్యారని పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డు అందుకుంటారని తెలిపారు.

కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

- వీక్షించిన మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నాయకులు

భువనగిరి : కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌లో పార్టీ నేతలు వీక్షించారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాలతో పాటు జిల్లాలోని ఇతర మండలాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు ప్రజెంటేషన్ విక్షించేందుకు తరలివచ్చారు. కార్యక్రమంలో భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, బూడిద భిక్షమయ్యగౌడ్, మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాయాల సంస్థ చైర్మన్ జడల అమరేందర్, మాజీ రైతు సమన్వయ సమితి కన్వీనర్ అమరేందర్ పాల్గొన్నారు.



పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు శేఖర్‌రెడ్డి, సునీతా మహేందర్‌రెడ్డి

తుది దశకు తనిఖీలు

- నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు
- ఇప్పటివరకు 70శాతం ఆస్పత్రుల్లో తనిఖీలు పూర్తి
- ఉన్నతాధికారులకు నివేదిక అందజేత

భువనగిరి: జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చేపట్టిన తనిఖీలు తుది దశకు చేరుకున్నాయి. గత నెలలో నిబంధనలకు విరుద్ధంగా మూడు అబార్షన్లు, ఒక చోట తల్లి, మరొక చోట శిశువు మృతి చెందడంతో అధికారులు దృష్టి సారించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లను తనిఖీ చేసేందుకు ప్రోగ్రాం ఆఫీసర్లతో ఆరు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. గత నెల 20వ తేదీ నుంచి తనిఖీలు చేయడం ప్రారంభించారు. ఈ ప్రక్రియ తుది దశకు చేరుకుంది.

ఈ అంశాలపై తనిఖీ

జిల్లాలో ప్రస్తుతం 171 ప్రైవేట్ ఆస్పత్రులు, 80 డయాగ్నోస్టిక్ సెంటర్లు ఉన్నాయి. ఆస్పత్రుల్లో ఇప్పటి వరకు 70 శాతం వరకు పూర్తి కాగా డయాగ్నస్టిక్ సెంటర్లు ఇప్పటికే పూర్తి చేశారు. మిగిలిన 30 శాతానికి సంబంధించి రెండు, మూడు రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. తనిఖీల్లో గుర్తించిన అంశాలకు సంబంధించి నివేదికను జిల్లా వైద్యాధికారికి అందజేశారు. నివేదికలో చాలా వరకు ఆస్పత్రులు నిబంధనలకు విరుద్ధంగానే నిర్వహిస్తున్నారని గుర్తించినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్ సమయంలో పేర్లు ఉన్న వారుకాకుండా మరొకరు వైద్య సేవలందించడం, బయోమెడికల్ వేస్ట్ మెనేజ్‌మెంట్ నిర్వహణ లేకపోవడం, ఆర్‌ఎంపీలు లేదా ఆయూష్ వైద్యుల ద్వారా వైద్య సేవలందించడం, శిక్షణ లేని పారామెడికల్ సిబ్బంది ఉండటం, వెలుతురు, గాలి, నీటి సౌకర్యం లేకుండా ఆస్పత్రుల నిర్వహణ, ఫైర్ సిస్టం లేకపోవడం వంటి వాటిని గుర్తించినట్లు తెలుస్తోంది.



భువనగిరి పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న ప్రత్యేక బృందం

ఒక వైపు తనిఖీలు.. మరో వైపు పైరవీలు

ప్రత్యేక బృందాలు ఒక వైపు తనిఖీలు చేసి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆస్పత్రుల వివరాలు, డయాగ్నోస్టిక్ సెంటర్ల వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తమపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండేందుకు వీటి నిర్వాహకులు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల ద్వారా పైరవీలు చేయడం ప్రారంభించారు. ఫోన్ చేసి అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది.

గతంలో మాదిరిగానే వదిలేస్తారా..

సాధారణంగా జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఆరు నెలలకొకసారి ప్రత్యేక అధికారులు బృందం ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లను తనిఖీ చేస్తుంటారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆస్పత్రులకు, డయాగ్నోస్టిక్ సెంటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు. అవసరమైతే సీజ్ చేస్తారు. అయితే వివిధ ప్రయత్నాలు చేసి ఆస్పత్రుల నిర్వాహకులు తిరిగి యథావిధిగా నిర్వహిస్తున్నారు. జిల్లాలో గత నెలలో జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బృందాలు గుర్తించిన అంశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటారా లేదా గతంలో మాదిరిగానే వదిలేస్తారా అని పట్టణ వాసులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు

ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో తనిఖీలు జరుగుతున్నాయి. తనిఖీల ప్రక్రియ పూర్తి కాగానే పూర్తి వివరాలతో ఉన్నత అధికారులకు అందజేసి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ మనోహర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

క్లుప్తంగా

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జాం

- ఇబ్బందులు పడిన వాహనదారులు



విజయవాడ-హైదరాబాద్ హైవేపై తూప్రాన్‌పేట వద్ద నిలిచిపోయిన వాహనాలు

చౌటుప్పల్ రూరల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం తుప్రాన్‌పేట గ్రామంలో ట్రాఫిక్ జాం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాలు.. సోమవారం అర్ధరాత్రి నల్లగొండ వైపు నుంచి సిమెంట్ లోడ్‌తో హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ తూప్రాన్‌పేట గ్రామంలో హైవేపై మరమ్మతులకు గురైంది. హైవేపై పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ట్రాఫిక్ జాం కాకుండా వాహనాలను పంపించారు. అయితే మంగళవారం తెల్లవారుజామున పోలీసులు ఘటనా స్థలం నుంచి వెళ్లిపోవడంతో మధ్యాహ్నం వరకు తూప్రాన్‌పేట గ్రామంలో హైదరాబాద్ వెళ్లే వైపు సుమారు 2 కి.మీ. మేర ట్రాఫిక్ జాం అయ్యింది. దీంతో హైదరాబాద్ వైపు వెళ్లాల్సిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ట్రాఫిక్ పోలీసులు, సివిల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని రోడ్డు పక్కకు తొలగించడంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదలిలాయి.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి బైక్ వస్తున్న కానిస్టేబుల్ ట్రాక్టర్‌ను ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటన చివ్వెంల మండలం బీబీగూడెం గ్రామంలో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం పాశ్యానాయక్ తండా గ్రామానికి చెందిన ధరావతు సోమాని(55) సూర్యాపేట సబ్ జైలులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం బైక్‌పై సూర్యాపేటకు వెళ్తుండగా.. మార్గమధ్యలో బీబీగూడెం వద్ద మండల కేంద్రం నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. వెనుక నుంచి బైక్‌పై వస్తున్న సోమాని అదుపుతప్పి ట్రాక్టర్‌ను ఢీకొని కిందపడ్డాడు. అదే సమయంలో సూర్యాపేట వైపు వెళ్తున్న మరో బైక్ సోమాని పైనుంచి వెళ్లడంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు అతడిని సూర్యాపేట ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వి. మహేశ్వర్ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలు మృతి

వలిగొండ: వలిగొండ మండలం ఏదుళ్లగూడెం రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు రైలు ఢీకొని వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన మంగళవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం తాజపూర్‌కు చెందిన గుళ్ళని పోచమ్మ (90) ఏదుళ్లగూడెంలో తన బంధువుల ఇంటికి వస్తుండగా.. గ్రామ సమీపంలోని రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద ఇటీవల కురిసిన వర్షానికి నీరు నిలిచి ఉండడంతో బ్రిడ్జి పైనుంచి రైలు పట్టాలు దాటుతుండగా.. రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

మన చేనేత.. ఘనత

కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు 13 మంది చేనేత కార్మికులు ఎంపిక

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేతలో విశేష ప్రతిభ కనబర్చిన కళాకారులను ప్రతియేటా కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుతో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ సత్కరిస్తోంది. ఈ అవార్డుకు ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు చేనేత కళాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ చేతులమీదుగా వారు రూ.25వేల నగదు పురస్కారం, మెమొంటో, ప్రశంసా పత్రం అందుకోనున్నారు.

జీవ వైవిధ్యం ప్రతిబింబించేలా మద్రాస్ ఇక్కత్ చీర

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లికి చెందిన చేనేత కళాకారుడు మంగళపల్లి శ్రీహరి వినూత్న డిజైన్లతో మద్రాస్ ఇక్కత్ చీరను రూపొందించి ఉత్తమ వీవర్‌గా కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపికయ్యారు. ఏడాది పాటు కష్టపడి 234 కొయ్యలు, రిపిట్ లేకుండా ఆరు వరుసల్లో వైట్ బేస్ చీరలో ప్రకృతి అందాలతో పరవశించి నృత్యం చేస్తున్న అంబారీ, నెమలిని రూపొందించారు. అంతేకాక మధ్య మధ్యన మన తెలంగాణ పండుగను ప్రతిబింబేలా బతుకమ్మ, పద్మాల డిజైన్లను వేశారు. డిజైన్లు స్పష్టంగా కన్పించేలా వైట్ బేస్ చీరలో ఆనంద, బ్లాక్, మెరూన్, పసుపు, ఆకుపచ్చ రంగులను వినియోగించారు. డిజైన్లను రూపొందించడం, వాటిని గ్రాఫ్‌పై గీయడం, అందుకనుగుణంగా చిటికి కట్టడం, మగ్గం నేయడం కోసం మూడు నెలలు కష్టపడినట్లు ఆయన పేర్కొన్నారు. అంతేకాక ఆయన నాలుగు మగ్గాలను పెట్టి నాలుగు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నారు. తాను పడిన కష్టానికి తగిన గుర్తింపు వచ్చిందని శ్రీహరి ఆనందం వ్యక్తం చేశారు.



అవార్డు దక్కించుకున్న మద్రాస్ ఇక్కత్ చీర ఇదే..

పోచంపల్లి డబుల్ ఇక్కత్ చీర..

చిట్యాల: చిట్యాల మండలం సుంకెనపల్లి గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు చిట్టిప్రోలు ధనుంజయ్య మగ్గంపై నేసిన పోచంపల్లి డబుల్ ఇక్కత్ తరహాలోని చీరకు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు దక్కింది. ఈ అవార్డుకు ఎంపిక చేసిన ప్రభుత్వానికి, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ధనుంజయ్యకు అవార్డు రావటం పట్ల చిట్యాల మండలానికి చెందిన పలువురు పద్మశాలీలు హర్షం వ్యక్తం చేశారు.



డబుల్ ఇక్కత్ చీర నేస్తున్న చిట్టిప్రోలు ధనుంజయ్య

50 ఏళ్ల కష్టానికి దక్కిన ఫలితం

గట్టుప్పల్: గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు గుర్రం యాదయ్య గత 50 ఏళ్లుగా చేనేత వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. చేనేతలో కొత్త కొత్త డిజైన్లు తయారు చేస్తేనే మార్కెట్‌లో మంచి ఆదరణ ఉంటుందని గుర్తించి.. తన భార్య జయమ్మ సహకారంతో పోచంపల్లి డబుల్ ఇక్కత్ మల్బరీ సిల్క్‌తో వెరైటీ చీర తయారు చేశారు. ఇందుకు గాను ఆయన కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపికయ్యారు.



గుర్రం యాదయ్య

నలభై ఏళ్ల అనుభవానికి గుర్తింపు

వలిగొండ: మండలంలోని గొల్లపల్లికి చెందిన చేనేత కార్మికుడు చల్లమల్ల కృష్ణ కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపికయ్యారు. గత 40 ఏళ్లుగా చేనేత కళాకారుడిగా పనిచేస్తున్న ఆయన తెల్ల రుమాల్, డబుల్ ఇక్కత్ 100% కాటన్ చీరలు నేస్తున్నారు. తన అనుభవానికి గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం తనను కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపిక చేసిందని ఆయన అన్నారు. అవార్డుకు ఎంపికైన కృష్ణను కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు అభినందించారు.



చల్లమల్ల కృష్ణ

త్రీడీ ఎఫెక్ట్‌తో రూపొందించిన చీర



అవార్డుకు ఎంపికైన చీరను మడత వేస్తున్న భాస్కర్, విజయలక్ష్మి

సంస్థాన్ నారాయణపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని పుట్టపాక గ్రామానికి చెందిన సామల భాస్కర్ ఎంపికయ్యారు. భాస్కర్ తన 33 సంవత్సరాల చేనేత అనుభవంతో త్రీడీ ఎఫెక్ట్ ఉండేలా కొత్త డిజైన్‌తో చీరను రూపొందించారు. సాధారణంగా ఒక చీరకు 30 మెట్లు ఉంటే.. భాస్కర్ 1450 మెట్లతో నెమలి దేవత ఆకృతులతో గ్రాఫిక్ డిజైన్‌తో రూపొందించారు. నిలువు, 4అచ్చెలతో ప్యూర్ సిల్క్ చీరను 10 నెలల్లో తయారు చేశారు. ఈ చీర తయారీకి 7 రంగులను వాడినట్లు ఆయన పేర్కొన్నారు. తన భార్య విజయలక్ష్మి సహకారంతో కొత్త చీరను రూపొందించానని, దానికి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని భాస్కర్ తెలిపారు. ఈ అవార్డుతో తమ చీరకు మార్కెటింగ్ ఏర్పడి తమ జీవనపాధికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అవార్డుకు ఎంపిక చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

డిజైనింగ్‌లో ప్రతిభ



మగ్గం నేస్తున్న గాజుల అనిల్

గట్టుప్పల్: చేనేత చీరల డిజైనింగ్‌లో ప్రతిభ కనబర్చిన గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన గాజులు అనిల్ కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు ఎంపికయ్యారు. ఆయన 2012 నుంచి పోచంపల్లి ఇక్కత్(జకార్డ్) చీరల బార్డర్లపై అన్ని రంగులతో డిజైన్లు వేస్తున్నారు. ఈ చీరలకు మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉంది. అనిల్ ప్రతిభను గుర్తించిన రాష్ట్ర చేనేత, జౌళి శాఖ అధికారులు ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. అనిల్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

చిన్నతనం నుంచే జీతమున్నా..

చండూరు: చండూరు మండల కొండాపురం గ్రామానికి చెందిన అవ్వారి రవీందర్ తయారు చేసిన ఇక్కత్ రాజ్‌కోట్ చీరకు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు దక్కింది. ఇవి వేరే దేశాలతో పాటు రాజస్తాన్, అహ్మదాబాద్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తాను 10 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడే మగ్గం పనిచేసే వారి వద్ద జీతం ఉన్నానని, ఆ తర్వాత బొంబాయికి వలస వెళ్లి అక్కడ పదేళ్లు ఉండి సాంచన్‌లు నడిపి తిరిగి కొండాపురం గ్రామం వచ్చినట్లు రవీందర్ తెలిపారు. కొత్తగా వచ్చే డిజైన్లను గమనించి చీరలు తయారు చేయడం తనకు అలవాటని ఆయన పేర్కొన్నారు. 20 ఏళ్ల కిందటే 5 మగ్గాలతో చీరలు నేయించినట్లు వివరించారు. ప్రస్తుతం తనకు 69 ఏళ్లని, ఇన్నేళ్లకు తనకు గుర్తింపు లభించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



మగ్గం నేస్తున్న అవ్వారి రవీందర్

పదహారు ఆకృతులతో తేలియా రుమాల్‌పై..

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని పుట్టపాక గ్రామానికి చెందిన గూడ పవన్ పదహారు ఆకృతులతో తేలియా రుమాల్ అనే వస్త్రంతో చీర తయారుచేసి కొండ లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపికయ్యారు. ఈ చీర బంతిపూలు, రథం, త్రీడీ డిజైన్‌తో పాటు అనేక డిజైన్‌లతో కూడి ఉంటుంది. మడతలు పడకుండ మృదవైన పట్టును వాడినట్లు ఆయన తెలిపారు. రంగు వెలవని ఈ చీర తయారీకి రూ.75వేలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఇదే చీరకు ఆయన జాతీయ చేనేత అవార్డు కూడా అందుకోనున్నారు. జాతీయ, రాష్ట్ర అవార్డులు రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.



మగ్గం నేస్తున్న గూడ పవన్

108 డిజైన్లు.. 29 రంగులు

గట్టుప్పల్: ఎంతో శ్రమించి 108 డిజైన్లు, 29 రంగులతో చీరను తయారుచేశారు గట్టుప్పల్‌కు చెందిన కర్నాటి కృష్ణయ్య. ఆయన గత 40 ఏళ్లుగా చేనేత మగ్గంపై ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. చేనేతలో కొత్తదనం సృష్టించాలనే తపనతో కృష్ణయ్య ఏడాది క్రితం 108 డిజైన్లు, 29 రంగులతో చీర తయారు చేయడం ప్రారంభించారు. నెలరోజుల క్రితం ఈ చీర తయారీ పూర్తయ్యింది. క్వాలిటీ, కలర్స్, డిజైన్స్‌ను పరిశీలించిన చేనేత శాఖ అధికారులు కృష్ణయ్యను కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపిక చేశారు. ఇన్నేళ్ల తన కష్టానికి సరైన గుర్తింపు దక్కడంతో కృష్ణయ్య ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



తాను తయారు చేసిన చీరతో కర్నాటి కృష్ణయ్య

మూడేళ్లు.. ముగ్గురు అన్నదమ్ములకు అవార్డులు

చండూరు: చండూరు మండల కేంద్రానికి చెందిన చిలుకూరి శ్రీనివాసులు సహజ సిద్ధమైన రంగులతో డబుల్ ఇక్కత్ దుపట్టాను తయారు చేసి కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపికయ్యారు. శ్రీనివాసులు అన్న చిలుకూరి క్రిష్ణయ్య 2023లో, తమ్ముడు చిలుకూరి ధనుంజయ 2024లో కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డులు అందుకున్నారు. దాదాపు 35 సంవత్సరాలుగా ముగ్గురు అన్నదమ్ములు డబుల్ ఇక్కత్ పైనే ప్రావీణ్యం సంపాదించారు. మూడేళ్ల క్రితం వరకు రసాయన రంగులతో డబుల్ ఇక్కత్ వస్త్రాలు నేసినా ఆ తర్వాత నుంచి సహజ సిద్ధమైన రంగులకు మారి మంచి ఆదరణ పొందుతున్నారు. ఈ ఉత్పత్తులకు మంచి డిమాండ్ కూడా ఉంది. దుపట్టా తయారు చేసేందుకు రెండు నెలల సమయం పట్టిందని, శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీపై ముడి సరుకులు ఇచ్చి చేనేత కార్మికులను ప్రోత్సహిస్తే ఉత్పత్తిని పెంచి తక్కువ ధరల్లో వస్త్రాలు అందుబాటులో ఉంచేందుకు వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. తనకు అవార్డు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు.



చిటికీపై డిజైన్ సెట్ చేస్తున్న శ్రీనివాసులు

న్యూ మ్యాట్రిక్ టిల్ శారీ ఎంతో స్పెషల్

చండూరు: న్యూ మ్యాట్రిక్ టిల్ ఇక్కత్ విధానంలో చీర నేసి చండూరు మండల కేంద్రానికి చెందిన కర్నాటి సద్గురు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డుకు ఎంపికయ్యారు. ఈ స్పెషల్ ఇక్కత్ చీర నేసేందుకు ఐదు నెలల సమయం పట్టిందని ఆయన పేర్కొన్నారు. డిజైన్ ఫైనల్ చేయడం, మగ్గంపై డిజైన్ నూలుపై సెట్ చేయడానికే రెండు నెలల సమయం పట్టిందన్నారు. 25 ఏళ్లుగా మగ్గం నేస్తున్నానని, తనకున్న అనుభవంతో కొత్త డిజైన్లతో చీరలు రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ చీర ధర రూ.25వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఈ తరహా చీర నల్లగొండ జిల్లాలో తానొక్కడినే చేశానని, అంత ప్రత్యేకం కాబట్టే అవార్డుకు ఎంపికైందని ఆయన తెలిపారు. సబ్సిడీ ముడి సరుకుల డిపో నల్లగొండ లేదా చౌటుప్పల్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



అవార్డు వచ్చిన న్యూ మ్యాట్రిక్ టిల్ ఇక్కత్ చీర



మగ్గంపై చీర నేస్తున్న కర్నాటి సద్గురు

కొత్త డిజైన్ అవార్డు తెచ్చింది

సంస్థాన్ నారాయణపురం: సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన కొలను శంకర్ లెనిన్ డబుల్ ఇక్కత్ చీర తయారుచేశారు. లెనిన్ డబుల్ ఇక్కత్ చీర నేయడం దేశంలో ఇదే మొదటిసారి. ఈ చీర 15 షేడులు, సున్నితమైన దారాలతో రంగు వెలిసిపోని చీర. ఈ చీర డిజైన్ కోసం సంవత్సరం కాలం పట్టిందని శంకర్ తెలిపారు. చీర తయారీకి రూ.50వేలు ఖర్చు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తన 30సంవత్సరాల అనుభవంలో ఎన్నో రకాల చీరలు తయారు చేశానని, కానీ అవార్డు కోసం ఎప్పుడూ దరఖాస్తు చేసుకోలేదన్నారు. ఈ చీరకు దరఖాస్తు చేసుకోవడంతో కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.



మగ్గం నేస్తున్న కొలను శంకర్

సహజ రంగులతో చీర తయారుచేసి..

గట్టుప్పల్: గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికుడు మునగపాటి శ్రీనివాస్ సహజ రంగులతో డబుల్ ఇక్కత్ చీర తయారు చేశారు. చేనేతలో కొత్త కొత్త ప్రయోగాలు చేస్తూ ముందుకు సాగాలనే లక్ష్యంతో ఉన్నట్లు శ్రీనివాస్ తెలిపారు. తనకు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక ముందు కూడా అనేక రకాల కొత్త డిజైన్లతో చీరలు తయారు చేస్తానన్నారు.



మునగపాటి శ్రీనివాస్

రేషన్ బియ్యం పట్టివేత

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మంగళవారం 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మాల్‌కు చెందిన జర్పుల వెంకటేష్ పెద్దవూర మండలంలో 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం సేకరించి కారులో తరలిస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

- మహిళ మృతి
- మరో ఇద్దరికి స్వల్ప గాయాలు

చౌటుప్పల్ రూరల్: రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో మహిళ మృతిచెందింది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం బొర్రోళ్లగూడెం గ్రామ స్టేజీ వద్ద మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం చిరుకూరపాడు గ్రామానికి చెందిన మద్దిరాల ప్రవీణ్‌కుమార్ బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ.. నెల రోజుల క్రితం హైదరాబాద్‌కు బదిలీ అయ్యాడు. హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌లో నివాసం ఉండడానికి ఇల్లు చూసుకున్నాడు. తన తల్లి గోవిందమ్మ(62), భార్య సుమతితో కలిసి అద్దె ఇంట్లో దిగేందుకు స్వగ్రామం చిరుకూరుపాడు నుంచి సోమవారం రాత్రి 9గంటలకు కారులో హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో మంగళవారం తెల్లవారుజామున చౌటుప్పల్ దాటిన తర్వాత బొర్రోళ్లగూడెం గ్రామ స్టేజీ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. కారు ముందు సీట్లలో ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో డ్రైవింగ్ చేస్తున్న ప్రవీణ్, అతడి భార్య సుమతికి స్వల్ప గాయాలయ్యాయి. వెనుక సీట్లులో కూర్చున్న ప్రవీణ్ తల్లి గోవిందమ్మకు ఛాతి భాగంలో బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. గోవిందమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి మరిది మద్దిరాల నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌జాం కావడంతో సీఐ మన్మథకుమార్, ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



ప్రమాదంలో మృతిచెందిన గోవిందమ్మ, పక్కన ఆమె కుమారుడు, కోడలు

నకిరేకల్ పట్టణంలో కార్డెన్ సెర్చ్

- 300 మంది పోలీసులతో సోదాలు
- 250 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- గంజాయి అనుమానితుల అరెస్ట్
- పాత నేరస్తుల గుర్తింపు



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్, డీఎస్పీ శివరాంరెడ్డి

నకిరేకల్: నకిరేకల్ పట్టణంలో మంగళవారం తెల్లవారుజామున నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 20 మంది ఎస్‌ఐలు, 300మంది పోలీస్ సిబ్బంది కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తాటికల్ రోడ్డులోని ఎస్సీ కాలనీ, వడ్డెర కాలనీ, మొండివారి కాలనీల్లోని ఇళ్లను తనిఖీ చేశారు. ఉదయం 7 గంటల వరకు ఈ కార్డన్ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని ద్విచక్ర వాహనాలను, గంజాయి అనుమానితులను, వివిధ కేసుల్లో ఉన్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కార్డెన్ సెర్చ్ ముగిసిన తర్వాత నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ నకిరేకల్‌కు చేరుకుని తాటికల్ రోడ్డులోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ నందు ఉంచిన పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ముందుస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగానే కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలను సమన్వయం చేస్తూ శాంతిభద్రతలను కాపాడటం కోసం కార్డెన్ సెర్చ్, కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో సరైన ధ్రువపత్రాలు లేని 130 బైక్‌లు, 10 ఆటోలు, మరో 120 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 8 మంది పాత నేరస్తులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 18 మంది గంజాయి అనుమానితులను కూడా పట్టుకున్నామన్నారు. ముగ్గురు నేపాల్ దేశస్తులను గుర్తించినట్లు తెలిపారు. ఒక షెడ్డులో 15 గోవులను గుర్తించి పట్టుకున్నామన్నారు. ఆయా కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. ఇళ్ల అద్దెకు ఇచ్చేముందు పూర్తి వివరాలు తెలుసుకున్నాకే అద్దెకు ఇవ్వాలని కోరారు. ఎవరైనా గంజాయి సేవిస్తున్నట్లు, విక్రయించినట్లు తెలిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో శాలిగౌరారం, చండూరు, నల్లగొండ ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్ల సీఐలు కొండల్ రెడ్డి, రాఘవరావు, ఆదిరెడ్డి, కరుణాకర్, మహాలక్ష్మయ్య, వివిధ మండలాల ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీకి యత్నం

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని ఓ పాత ఇంట్లో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నించాడు. పోలీసులు, ఇంటి యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణంలోని కామునికంత ప్రాంతానికి చెందిన నాయిని విద్యాసాగర్ శిథిలావస్థకు చేరిన తన పాత ఇంటిని వదిలి స్థానిక హౌజింగ్‌బోర్డు కాలనీలో కుటుంబ సభ్యులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. అయితే రహదారి వెంట ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించే గుర్తుతెలియని వ్యక్తి విద్యాసాగర్ ఇంట్లోకి చొరబడి సామగ్రిని చోరీ చేసేందుకు యత్నించాడు. స్థానికులు గమనించి అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

పారిపోయిన విద్యార్థుల ఆచూకీ లభ్యం

- రైలులో హైదరాబాద్‌కు వెళ్లి.. తిరిగి రైలులోనే మిర్యాలగూడకు రాక
- మదర్సా నిర్వాహకులకు అప్పగించిన పోలీసులు

మిర్యాలగూడ టౌన్: మదర్సా గోడ దూకి పారిపోయిన ఇద్దరు విద్యార్థుల ఆచూకీ మంగళవారం లభ్యమైంది. మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ పంచాయతీలోని మదర్సాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే ఉస్మాన్ అఖిల్, ఎస్‌కే అయ్యూబ్ చదువుకుంటున్నారు. వీరిద్దరు సోమవారం అర్ధరాత్రి 1:15గంటలకు వారిద్దరు మదర్సా గోడ దూకి నేరుగా మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున గుంటూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ట్రైన్‌లో హైదరాబాద్‌కు వెళ్లారు. అక్కడ సాలార్జంగ్ మ్యూజియం చూసి ఫలక్‌నుమా ట్రైన్‌లో తిరిగి మిర్యాలగూడకు చేరుకున్నారు. ఇద్దరు విద్యార్థులు అనుమానస్పదంగా ఉండటంతో స్థానికులు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. ఇద్దరు విద్యార్థులను మదర్సా నిర్వాహకులకు అప్పగించినట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపారు.